# ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు

**చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక**



చేవెళ్లలోని బండారి శ్రీనివాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న రంగారెడి కలెక్టర్ శశాంక

షాబాద్, మే 9 : పార్లమెంటు ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చేవెళ్ల పార్లమెంట్ నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక తెలిపారు. గురువారం చేవెళ్లలోని బండారి శ్రీనివాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూంలను సాధారణ ఎన్నికల పరిశీలకుడు రాజేందర్‌కుమార్ కటరియా, పోలీస్ పరిశీలకుడు కాలూరామ్ రావత్, వ్యయ పరిశీలకుడు రాజీవ్ చావ్రా, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి శశాంక పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి, పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని, పోలింగ్ రోజు సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టామని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మహిళా పోలీసును అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లపై సంబంధిత ఏఆర్‌ఓలకు తగు సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు పరిశీలకులకు తెలిపారు. కేంద్ర బలగాల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లు, కౌంటింగ్ ప్రక్రియకు అవసరమైన సిబ్బంది నియామకం, అవసరమైన సామగ్రి ఏర్పాట్లు పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. సి-విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించినట్లు చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన అర్బన్ ప్రాంతాల్లోని ప్రజలకు స్వీప్ కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించినట్లు పరిశీలకులకు తెలిపారు. సమావేశంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి, వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రాహుల్‌శర్మ, ఉమాహారతి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ, డీఆర్వో సంగీత, డీసీపీ శ్రీనివాస్, సంబంధిత ఏఆర్‌ఓలు, నోడల్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ వెన్నంటే.. 'బీసీ' బలగం

## ప్రచారంలో దూసుకెళ్తున్న బీసీ అభ్యర్థులు

## నేతలతో సమన్వయం..నిత్యం ప్రజలతో మమేకం



**చేవెళ్ల, భువనగిరి లోక్‌సభ స్థానాల్లో అనూహ్యంగా బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారిన రాజకీయం**

**కాసాని జ్ఞానేశ్వర్, క్యామ మల్లేశ్‌లకు బీసీ వర్గాల నుంచి మస్త్ ఆదరణ**

**-బీఆర్ఎస్ గెలుపుపై గులాబీ శ్రేణుల ధీమా**

రంగారెడ్డి, మే 9 (నమస్తే తెలంగాణ) : ఎంపీగా ఎవరు గెలిస్తే.. తమకు న్యాయం జరుగుతుందన్న అంశంపై చేవెళ్ల, భువనగిరి లోక్‌సభ స్థానాల్లో చర్చ జోరందుకున్నది. బీసీ అభ్యర్థులను గెలిపించుకుంటే కలిగే లాభంపై బీసీ వర్గాలు ఆలోచనలోపడ్డాయి. ఈ రెండు లోక్‌సభ స్థానాల్లో పరిస్థితులు అనూహ్యంగా మారి బీఆర్ఎస్ అభ్యర్థులకు అనుకూలంగా మారాయి. బీఆర్ఎస్ ప్రభావాన్ని తొలుత కాంగ్రెస్, బీజేపీలు తక్కువ అంచనా వేయగా.. తాజా పరిస్థితులు ఆ రెండు పార్టీల అంచనాలను ఒక్కసారిగా తలకిందులను చేశాయి. బీఆర్ఎస్‌కు ఆదరణ పెరుగుతున్నదనడానికి సబ్బండ వర్గాల నుంచి ఎంపీ అభ్యర్థులు కాసాని జ్ఞానేశ్వర్, క్యామ మల్లేశ్‌లకు వస్తున్న ఆదరణనే నిదర్శనమని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ రెండు లోక్‌సభ స్థానాల్లోనూ మెజార్టీవర్గంగా ఉన్న బీసీలు బీఆర్ఎస్‌కే అండగా నిలువనున్నారని ఆయా వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. రానున్న రోజుల్లో ఇది మరింత బలోపేతమై బీఆర్ఎస్ విజయబావుటా ఎగురవేయడం ఖాయమని గులాబీ శ్రేణులు ధీమాగా చెబుతున్నాయి.

### జనంలో మస్త్ ఆదరణ..

చేవెళ్ల, భువనగిరి ఎంపీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఇద్దరూ బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే కావడం.. రాజకీయాల్లో అనుభవజ్ఞులు కావడంతో ప్రత్యర్థి పార్టీలకు భిన్నంగా జనంలోకి వెళ్తున్నారు. అవినీతి రహితులుగా.. మచ్చలేని వ్యక్తులుగా.. ప్రజల బాధలు తెలిసిన వారుగా ఇద్దరికీ మంచి పేరు ఉండడంతో అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తున్నది. ముఖ్యంగా.. బీసీ సామాజిక వర్గాల నుంచి విశేష ఆదరణ కనిపిస్తున్నది. మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డిల నేతృత్వంలో పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలంతా సమన్వయంతో కాసాని, క్యామ మల్లేశ్‌ల గెలుపునకు కృషి చేస్తున్నారు. ఈ రెండు ఎంపీ సీట్లను గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్న సంకల్పంతో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. సభలు, సమావేశాలు, రోడ్డు షోలు, కార్నర్ మీటింగ్‌లతో నిత్యం జనం మధ్యనే ఉంటున్నారు. గులాబీ శ్రేణులు సైతం కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఓడించేందుకు కసితో పనిచేస్తున్నాయి. మండుటెండల్లోనూ అవిశ్రాంతంగా గడపగడపకూ వెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు ప్రచారం నిర్వహిస్తున్నారు. మరోపక్క బీసీ నినాదాన్ని జనంలోకి బలంగా తీసుకెళ్తున్నారు. బీసీల్లోని అన్ని సామాజిక వర్గాలను కలిసి మద్దతును కూడగడుతున్నారు. బీసీ సంఘాల నేతలే అభ్యర్థుల ప్రచారంలో ఎక్కువగా పాల్గొంటుండడంతో బీసీ వాదనకు బలం చేకూరుస్తున్నది.

### ఆత్మరక్షణలో కాంగ్రెస్, బీజేపీలు..

కాంగ్రెస్, బీజేపీల పాలనావైఫల్యాలు సైతం చేవెళ్ల, భువనగిరి ఎంపీ అభ్యర్థులకు కలిసొస్తున్నాయి. ఎన్నికల నాటి హామీలను కాంగ్రెస్ విస్మరించడంతో గుర్రుగా ఉన్న సబ్బండ వర్గాలు ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్‌వైపు చూస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించగా.. కనీసం ఆదుకునే ప్రయత్నాన్ని సర్కారు చేయకపోవడంపై రైతాంగం ఆగ్రహంతో ఉన్నది. రైతుబంధు, రుణమాఫీ విషయాల్లోనూ రైతులు కాంగ్రెస్‌పై కన్నెర్రజేస్తున్నారు.

తెలంగాణపై ఆది నుంచీ వివక్షను చూపుతున్న బీజేపీపై ప్రజలు అసహనంతో ఉన్నారు. బీజేపీ ఆగడాలను అడ్డుకునే శక్తి కేవలం బీఆర్ఎస్‌కే ఉన్నదని ప్రజలు నమ్ముతున్నారు. ఈ పరిస్థితులు బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారగా..కాంగ్రెస్, బీజేపీలను మాత్రం ఆత్మరక్షణలో పడేశాయి. కాంగ్రెస్, బీజేపీల అభ్యర్థులు రంజిత్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి గెలిచి ఇతర పార్టీల్లోకి వెళ్లిపోవడం కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ ఎన్నికల్లో వారిద్దరూ ఘోరంగా దెబ్బతినబోతున్నారని సర్వత్రా వినిపిస్తున్నది.



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి

# ఓట్ల లెక్కింపులో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

**వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**

వికారాబాద్, మే 9 : ఓట్ల లెక్కింపు ప్రక్రియకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం చేవెళ్ల ప్రాంతంలో ఉన్న బండారి శ్రీనివాస్ ఇంజినీరింగ్ కళాశాలలో చేవెళ్ల పార్లమెంటరీ ఓట్ల లెక్కింపుపై ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేందర్ కుమార్ కటారియా, ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాజీవ్ చావ్లా, పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, చేవెళ్ల పార్లమెంటరీ రిటర్నింగ్ అధికారి శశాంక మహంతి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూములు, సీలింగ్, గదులు, సీసీ కెమెరాల పనితీరును వారు పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే దారిని స్పష్టంగా తెలిపేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సామగ్రి ఎక్కువగా ఉన్నందున యువ కూలీలను ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. వీవీ ప్యాట్‌లు, బ్యాలెట్ యూనిట్లను పోలింగ్ కేంద్రాలవారీగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తగా అమర్చుకోవాలని కలెక్టర్ తెలిపారు. వాహనాల పార్కింగ్ నిమిత్తం స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, పరిగి, తాండూరు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేటలో ధాన్యం కుప్పల చుట్టూ చేరిన వర్షపు నీరు

# వర్షం.. నష్టం

- నేలరాలిన మామిడికాయలు, తడిసిన ధాన్యం
- 22 ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం

బొంరాస్‌పేట, మే 9 : బొంరాస్‌పేట మండలంలో బుధవారం సాయంత్రం, రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి అపార నష్టం వాటిల్లింది. బొంరాస్‌పేట, మెట్లకుంట, బురాన్‌పూర్ గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. బలమైన ఈదురుగాలులు, వర్షానికి 22 ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. మెట్లకుంట గ్రామంలోని కావలి సత్యయ్యకు చెందిన 7.5 ఎకరాలు, జగదీశ్వర్‌రెడ్డికి చెందిన 10 ఎకరాల్లోని మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని రైతు సత్యయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు. బొంరాస్‌పేట, మెట్లకుంట, బురాన్‌పూర్ గ్రామాల్లో 22 ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లినట్లు ఉద్యానవన శాఖ అధికారి తెలిపారు. అలాగే బొంరాస్‌పేట, మెట్లకుంట ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తెచ్చిన ధాన్యం తడిసిపోయింది. పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి.



మెట్లకుంట సత్యయ్య తోటలో నేల రాలిన మామిడి కాయలు

# 'కాసాని' గెలుపుతోనే..

**బీసీల ఐక్యతను దెబ్బ తీసేందుకు ఆధిపత్యవర్గాల కుట్ర**

**చేవెళ్ల ఎన్నికలో ఆలోచన చేయాలంటున్న బీసీ సంఘాలు**

**బీసీల రాజ్యాధికారానికి పునాది**



చేవెళ్ల లోక్‌సభ ఎన్నికతోనే బీసీ కులాలు రాజ్యాధికారానికి పునాది వేసుకోవాలని బీసీ సంఘాలు కోరుతున్నాయి. ఆధిపత్య వర్గాలు బీసీ వర్గాలు ఏకం కాకుండా ప్రయత్నం చేస్తున్నాయని నేతలు మండిపడుతున్నారు. బీసీ కులాలను అణచివేతకు గురిచేస్తున్న రాజకీయ పార్టీలకు ఓటు వేసే విషయంలో బీసీలంతా ఆలోచన చేయాలని వారు పేర్కొంటున్నారు. బీసీలకు బీఆర్ఎస్ తప్ప ఇతర పార్టీలేవీ ప్రాధాన్యత ఇవ్వడంలేదని బీసీ నేతలు వాపోతున్నారు. చేవెళ్ల లోక్‌సభలో బీసీలకు బీఆర్ఎస్ మంచి అవకాశం కల్పించిందని చెబుతున్నారు. బీసీల సమస్యలపై మాట్లాడే గళం పార్లమెంటులో ఉండాలని, బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుతోనే అది సాధ్యమని వారు స్పష్టం చేస్తున్నారు. చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు బీసీలంతా క్రియాశీలకంగా పనిచేయాలని పిలుపునిస్తున్నారు. *- రంగారెడ్డి, మే 9 (నమస్తే తెలంగాణ)*

### బీసీలంతా ఏకతాటిపైకి రావాలి



పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలంతా ఏకతాటిపైకి రావాలి. ఎన్నో ఏండ్ల తర్వాత చేవెళ్ల గడ్డపై ఒక బీసీ నేతకు ఎంపీ అభ్యర్థిగా అవకాశం వచ్చింది. బీసీలంతా ఒక్కసారి ఆలోచించి, పార్టీలకతీతంగా కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. కాసాని గెలుపొందితే లోక్‌సభలో తెలంగాణ గొంతుక వినిపించడంతో పాటు బీసీల సమస్యలపై పార్లమెంట్‌లో పోరాటం చేస్తారు.

*- చందిప్ప జంగయ్య, మల్లారెడ్డిగూడ(షాబాద్)*

### కాసాని గెలుపు ఖాయం



లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపొందడం ఖాయం. గతంలో బీఆర్ఎస్ తరపున గెలిచిన ఇద్దరు ఎంపీలు సొంత ప్రయోజనాల కోసం కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో చేరి మళ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో ప్రజలందరూ బీఆర్ఎస్ వైపే ఉన్నారు. పదేండ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలిచింది.

*- బండ అజయ్‌కుమార్, రుద్రారం(షాబాద్)*

### అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



బీసీలను అణచివేయాలన్న లక్ష్యంతో బీసీ నాయకత్వాన్ని ఎదగనీయకుండా కుట్రలు పన్నుతున్న కాంగ్రెస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో బీసీల ఐక్యత, ఓటు రుచి దెబ్బ చూపిస్తాం. బీఆర్ఎస్ బలపరచిన బీసీల ముద్దుబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు వెన్నంటి ఉంటాం. లేకపోతే వచ్చే ఐదేండ్లు అగ్ర కులహంకారానికి పని చేయాల్సి వస్తుంది. చేవెళ్ల గడ్డపై బీసీల ఐక్యత చాటుతాం.

*- శరణ్ భూపాల్, యాలాల మండల ప్రచార కమిటీ కార్యదర్శి*

### సమయం ఆసన్నమైంది



బీసీలు ఏకం కావాల్సిన సమయం వచ్చింది. బీసీలు ఏకమై అగ్ర వర్గాల రాజకీయ నాయకులను గతంలో గెలిపించుకుంటే వారి వల్ల బీసీలకు ఎలాంటి లాభం జరుగలేదు. కాసాని జ్ఞానేశ్వర్ గతంలో బీసీ కులాలను ఒక్క చోటుకి తెచ్చి ఐక్యవేదికను ఏర్పరిచారు. బీసీలను అవమానపర్చేలా మాట్లాడుతున్న ఇతర రాజకీయ పార్టీల దురహంకార మాటలకు త్వరలోనే సమాధానం చెప్తాం.

*- గోవిందు, ఎన్కేపల్లి, యాలాల మండలం*

### బడుగు బలహీన వర్గాల నేతను గెలిపించుకుందాం



బడుగు బలహీన వర్గాల నేత చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు బీసీ బిడ్డలందరూ ఏకమవ్వాలి. బీసీల్లో ఐక్యత లేదని ఉన్నత వర్గాల నాయకులు హేళన చేసి మాట్లాడుతున్న విషయాన్ని బీసీలు గమనించి మన ఓటుతో సత్తా ఏంటో చూపించాలి. మన నేతను గెలిపించి పార్లమెంట్‌కు పంపితే బీసీల గొంతుకను వినిపిస్తారు.

*- వడ్డె వెంట్‌రాములు, మోత్కూర్, దోమ మండలం*

### బీసీలను గేలిచేస్తున్న వారికి ఓటుతో బుద్ధి చెప్పాలి



ఉన్నత వర్గాలకు చెందిన నాయకులు బీసీలను గేలిచేస్తూ.. మీ బీసీలకు దమ్ముంటే మీ నాయకుడు జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల గడ్డపై గెలిపించుకోండని సవాల్ విసురుతున్నారు. అదే సవాల్‌ను చాలెంజ్‌గా తీసుకొని బీసీ వర్గాలంతా ఏకమై కాసానిని భారీ మెజార్టీతో గెలిపించి వారి సరైన బుద్ధి చెప్పాలి. బలహీనతను వదిలి ఓటు అనే బలాన్ని ఉపయోగించుకొని మన నాయకుడిని గెలిపించాలి.

*- మంగలి సత్యయ్య, మోత్కూర్, దోమ మండలం*

### కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం



బీసీలను గుర్తించి ఎంపీగా చేవెళ్ల నుంచి పోటీ చేయడానికి జ్ఞానేశ్వర్‌కు కేసీఆర్ అవకాశమిచ్చారు. బీసీలందరూ ఏకమై కాసానిని గెలిపించి ఆయనకు కానుకగా ఇద్దాం. బీసీల చైతన్యాన్ని చాటాలి. పార్లమెంట్‌లో బీసీల గళాన్ని వినిపించడానికి అవకాశం వచ్చింది. కదం తొక్కి.. ప్రజలను తప్పుదోవపట్టించే నాయకులకు బుద్ధి చెప్పాలి. *- పోలెమోని అశోక్ ముదిరాజ్, దాసర్లపల్లి, కందుకూరు*

### జెండాలను పక్కన పెడుదాం



పార్టీలకతీతంగా జెండాలను పక్కన పెట్టి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలి. అందుకోసం బీసీలందరూ కలిసి రావాలి. నిస్వార్థంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధికి జ్ఞానేశ్వర్ పోరాడుతుండు. కొన్నేండ్లుగా అగ్రకులాల వారు బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకుండ్రు. బీసీల పక్షాన మాట్లాడడానికి కాసానికి అవకాశం ఇవ్వాలి. *- ఆనేగౌని దామోదర్‌గౌడ్, పులిమామిడి, కందుకూరు*

### కాసానే నయం



కాంగ్రెస్, బీజేపీల కంటే చేవెళ్ల ఎంపీగా బీఆర్ఎస్ బలపర్చిన కాసాని జ్ఞానేశ్వరే నయం. ఆయన కొంత ప్రజలతో సంబంధం ఉన్న బీసీ నాయకుడు. ఆయన గెలిస్తే పార్లమెంట్‌లో మన ప్రాంత సమస్యలపై చర్చించగల అవకాశముంటుంది. కాంగ్రెస్, బీజేపీ అయితే చర్చించే అవకాశం తక్కువ. బీసీ అభ్యర్థిని గెలిపించుకుంటేనే బీసీలకు న్యాయం జరుగుతుంది.

*- నారాయణ, ఆటో డ్రైవర్, సులేమాన్ నగర్, రాజేంద్రనగర్*

### ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలి



దమ్ముంటే చేవెళ్లలో బీసీ నాయకుడిని గెలిపించుకోండి చూద్దాం అంటూ ఓ నాయకుడు సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలను అందరూ గుర్తు పెట్టుకుని ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలి. బీసీలంతా ఒకసారి ఆలోచించి చేవెళ్ల గడ్డపై కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటే ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారు.

*- వెంకటేశ్, మేస్త్రీ, శాస్త్రీపురం, రాజేంద్రనగర్*

### చేవెళ్ల గులాబీ అడ్డా.. కాసాని గెలుపు పక్కా..



చేవెళ్ల గులాబీ అడ్డా.. కాసాని గెలుపు పక్కా.. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను కోరుకుంటున్నారు. బీసీలకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బీఆర్ఎస్ పాలనలోనే అన్ని వర్గాలకు సమన్యాయం దక్కిందని, పార్లమెంట్‌లో బీసీల బలం పెరిగేలా బీఆర్ఎస్‌కు మెజార్టీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

*- పల్లపు మధుకర్, శేరిలింగంపల్లి*

### బీసీలకు న్యాయం జరగాలంటే బీఆర్ఎస్ రావాలి



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తక్కువ కాలంలోనే ప్రజల నమ్మకాన్ని కోల్పోయింది. బీసీలతో పాటు అన్ని వర్గాలకు న్యాయం చేకూరాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. చేవెళ్ల బీసీ అభ్యర్థి కాసానికి పూర్తి మద్దతునిచ్చేందుకు శేరిలింగంపల్లి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

*- లక్ష్మీనారాయణ ముదిరాజ్, చందానగర్*

### కాసాని గెలుపును ఎవరూ ఆపలేరు



కాసాని జ్ఞానేశ్వర్ గెలుపును ఎవరూ ఆపలేరు. చేవెళ్లలో కాసానిని గెలిపించి బీసీల ఐక్యత, సత్తాను చాటుతాం. బీసీలకు బీఆర్ఎస్ పార్టీ మాత్రమే పెద్దపీట వేసింది. ఇలాంటి అవకాశం మళ్లీ రాదు, కాంగ్రెస్, బీజేపీల జిమ్మిక్కులను ఎవరూ నమ్మరు. బీసీలను కించపరుస్తూ మాట్లాడిన అగ్రవర్గ నాయకుడికి తగిన బుద్ధి చెప్పాలంటే జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి.

*- భీంసేన్‌చారి, గట్టేపల్లి, ధారూరు మండలం*

### తగిన గుణపాఠం చెప్పాలి



దమ్ముంటే చేవెళ్లలో బీసీ నాయకుడిని గెలిపించుకోండి చూద్దాం అంటూ ఓ నాయకుడు సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలను అందరూ గుర్తు పెట్టుకుని ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలి. ఏ పార్టీలో ఇవ్వని విధంగా బీఆర్ఎస్ పార్టీలో ఆరుగురు బీసీ నేతలకు ఎంపీ అభ్యర్థులుగా అవకాశం కల్పించారు. బీసీలంతా ఒకసారి ఆలోచించి కాసానిని గెలిపించాలి.

*- రుమ్మ వెంకటేశం, నాగసముందర్, ధారూరు మండలం*



# ప్రచార ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి

రంగారెడ్డి, మే 9 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి లేకుండా పోలింగ్ రోజున అలాగే.. పోలింగ్‌కు ఒక రోజు ముందు (ఈ నెల 12, 13 తేదీల్లో) ప్రింట్ మీడియాలో ఎలాంటి ఎన్నికల ప్రచార ప్రకటనలను ప్రచురించకూడదని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రాజకీయ పక్షాలు, అభ్యర్థులు, ఇతరులు ఎవరైనా సరే ముందస్తుగా ఎంసీఎంసీ ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకుని ధ్రువీకరణ పొందాలని సూచించారు. లేకపోతే ఎన్నికల కమిషన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే రీతిలో ఆవేశపూరితమైన, తప్పుదోవ పట్టించే, ద్వేషపూరిత ప్రకటనలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వబడదని కలెక్టర్ స్పష్టం చేశారు.

**ఈ నెల 13న వేతనంతో కూడిన సెలవు**

ఈ నెల 13న ఎన్నికలు జరుగనున్న సందర్భంగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించిందని చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, పరిశ్రమలకు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# ఇంటర్‌లో ప్రవేశాలు ప్రారంభం

వికారాబాద్, మే 9 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సంలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ సురేశ్వరస్వామి తెలిపారు. తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు అడ్మిషన్ల షెడ్యూల్ ప్రకారం 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలలో బోధన జరుగుతున్నదన్నారు. విద్యార్థులకు ఉచిత అడ్మిషన్‌తో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేస్తామన్నారు. దూర ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వ హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. ప్రవేశాలు పొందే విద్యార్థులు పదో తరగతి పాస్ మెమో, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో కళాశాలలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 8919967326, 9441736441, 9441677674, 8985042143, 9959531361, 9000277315లను సంప్రదించాలని ఆయన తెలిపారు.